వాతంగిలో పోలీసుల పల్లె నిద్ర

ప్రజాశక్తి-రాజవొమ్మంగి :మండలంలోని వాతంగి గ్రామంలో శనివారం రాత్రి జడ్డంగి ఎస్ఐ చినబాబు ఆధ్వర్యంలో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో మమేకమయ్యారు.ఈ సందర్భంగా ఎస్ఐ చినబాబు మాట్లాడుతూ. సైబర్ మోసాలు, బాల్య వివాహాలు, గంజాయి రవాణా నిరోధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యువకులకు వాలీబాల్ కిట్‌ను పంపిణీ చేసారు. యువత చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి కనబరచాలని కోరారు. అనంతరం గ్రామస్తులకు ఎస్ఐ చినబాబు స్నాక్స్ పంపిణీ చేశారు.

మాట్లాడుతున్న ఎస్ఐ చినబాబు

దొరగూడ గ్రామానికి రోడ్డు లేక అవస్థలు

- కాలినడకన రోగులను డోలీలో తరలించేందుకు వెతలు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీకి చివరి గ్రామమైన దొరగూడ పివిటిసి గ్రామానికి రహదారి సౌకర్యం లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారు.లక్ష్మీపురం పంచాయతీ సిపిఎం సర్పంచి కొర్ర త్రినాథ్ ఆదివారం దొరగూడ గ్రామంలో సందర్శించి పలు పలు విషయాలను ప్రజాశక్తి దృష్టికి తీసుకొచ్చారు. ఈ గ్రామంలో పీవీటిజి తెగకు చెందిన (డిడోయ్) సామాజిక వర్గం ఆదివాసులు 22 కుటుంబాలతో సుమారు 110 మంది నివాసం ఉంటున్నారు. వారికి అత్యవసర వైద్య సేవలు అందాలన్నా, అనారోగ్యాలకు గురై ఆసుపత్రికి తరలించాలన్నా, గర్భిణీలకు డోలీలు శరణ్యమవుతున్నాయి. ఈ గ్రామంలో రోడ్డు, విద్యుత్, అంగన్వాడీ కేంద్రం, పాఠశాల భవనాలు వంటి ఏ విధమైన సౌకర్యాలు లేవు. అనారోగ్య సమస్య వచ్చిన కాలినడకన డోలీ మోతతో సుమారు 8 కిల్లో మీటర్లు దూరం ప్రయాణించి, రెండు వాగులు దాటి ప్రయాణించాలి. 2023 సెప్టెంబర్‌లో గ్రామంలో ఆంత్రాక్స్ వ్యాధి కలకలం రేపింది. ఈ గ్రామంలోని నివాసంలో ఉంటున్న వారందరికీ చర్మ వ్యాధి సోకి ముగ్గురు మృతి చెందారు. ఈ సమస్యలపై గతంలో అనేక దఫాలుగా జిల్లా అధికారులు, గ్రీవెన్స్, స్పందన కార్యక్రమంలో వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. మంగళగిరిలో ప్రభుత్వం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పిర్యాదు మేరకు అక్కడ నుండే మంత్రి కలెక్టర్ కు ఫోన్లో రోడ్డు మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ నేటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదనిసిపిఎం సర్పంచి కొర్ర త్రినాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దొరగూడ పివిటిసి గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసి పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రోగిని డోలీలో తరలిస్తున్న బంధువులు (ఫైల్ ఫొటో)

డిప్యూటీ కలెక్టర్ దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- డిప్యూటీ కలెక్టర్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-చింతపల్లి:1988-89 విద్యా సంవత్స రానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం చింతపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వద్ద ఘనంగా నిర్వహించారు. సుదీర్ఘకాలం తర్వాత షేక్ ఖాసిం వలి ఆధ్వర్యంలో తోటి విద్యార్థి మాదాబత్తుల మురళీ మనోహర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి సహచర విద్యార్థులు తరలివచ్చారు. రాజమండ్రి ఓఎన్జిసి లో డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న పనసల భాగ్యవతి, బాలకృష్ణ నాయుడు దంపతులు, మండల విద్యాశాఖ అధికారి పనసల ప్రసాద్, సరస్వతి దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ,ఎంత ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ సహచర విద్యార్థులతో సన్మానాన్ని పొందడం ఆనందంగా ఉందన్నారు.అనంతరం చౌడుపల్లిలో విందు ఏర్పాటు చేసుకున్నారు.



సామ్యూల్‌ను సత్కరిస్తున్న సంఘం నేతలు

పిఆర్‌టియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లిలో పిఆర్‌టియు యూనియన్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చింతపల్లి ప్రాంతంలో సేవలు అందించిన యూనియన్ తొలితరం నాయకులు వసపరి సామ్యూల్‌ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా పిఆర్టియు అధ్యక్షులు యువి గిరి, రాష్ట్ర కౌన్సిలర్ కే.మత్యలింగం, మండల గౌరవ అధ్యక్షురాలు శెట్టి ఉత్తర కుమారి, ఉపాధ్యక్షులు కూడా సత్తిబాబు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ప్రధాన రహదారుల్లో రోడ్డుకు ఇరువైపులా దుకాణాదారులు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించ వద్దని స్థానిక టౌన్ సిఐ గోవిందరావు తెలిపారు. ఆర్డిఓ ఆఫీస్ నుండి ఆబీద్ సెంటర్, అభిద్ సెంటర్ నుండి కృష్ణ బజార్ వరకు రోడ్డుకు సమీపాన వ్యాపారాలు చేస్తున్న షాపులను యజమానులతో మాట్లాడారు.

చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలి

- కోడిపుంజు వలసలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి - ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: అరకులోయ మండలం సిరిగం పంచాయతీ కోడిపుంజు వలస గ్రామానికి చెందిన తొమ్మిది మంది చిన్నారులు వాంతులు విరోచనాలతో అరకు ఏరియా చికిత్స పొందుతున్నారు. వారిలో బారికి సుమలత,(9) జన్ని శ్రేష్టిత (4)జన్ని రాహుల్(5) కొర్రా రజిని (10) మాదల జాన్ పాల్, (9)జన్ని హర్షణ (7) చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, నేతలు పర్యటించి చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోడిపుంజు వలస గ్రామంలో వైద్య బృందం పర్యటించి వైద్య శిబిరం ఏర్పాటు చేసి మెరుగైన చికిత్స అందించాలన్నారు. గ్రామంలో రక్షిత మంచి నీరు సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. చిన్నారులు గత మూడు రోజుల నుండి చికిత్స పొందుతున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేసినట్లు చెప్పారు. గ్రామంలో తాగునీరు సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జిబాబు, పాంగి రామన్న, పాంగి నాని బాబు, కె.బుజ్జిబాబు, కిండంగి రామారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను పరామర్శిస్తున్న సురేంద్ర. నేతలు

బ్లడ్ కేన్సర్ బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి -కొయ్యూరు : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో, కష్టంలో ఉన్న వారి కన్నీళ్లు తుడవడంలో ఎప్పుడూ ముందుండే కొయ్యూరు రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ బ్లడ్ కేన్సర్‌తో మరణించిన రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన బాలుడు గోకిరి శ్యాంప్రకాష్ పెద్దకర్మకు నిత్యవసరాలు, నగదు సాయం అందించారు. కొయ్యూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి గోకిరి శ్యామ్‌ప్రకాష్ బ్లడ్‌కేన్సర్‌తో బాధపడుతూ, వారం రోజుల క్రితం మరణించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు బాలుని పెద్దకర్మకు రత్నాజీ, బొంకు సుధాకర్, వికాస్ రెడ్డి సహకారంతో రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ ఆహార సామగ్రి, ఖర్చులకు నగదు సాయం అందించాడు చిన్నతనంలోనే ఇటువంటి కష్టం ఏ పిల్లాడికి రాకూడదంటూ దుమంతి సత్యనారాయణ కన్నీటి పర్యంతమయ్యారు.కార్యక్రమంలో అశోక్ లాల్, దుమంతి రామకృష్ణ, మొయిరి రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సరుకులు ఇస్తున్న సత్యనారాయణ

మన్యం బంద్ జయప్రదానికి విస్తృత ప్రచారం

పలుచోట్ల సన్నాహక సమావేశాలు ... వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ .. సంతల్లోనూ, ఇంటింటా కరపత్రాల పంపిణీ

అరకులో మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

మన్యంలో పర్యాటకాభివృద్ధికి అవసరమైతే 1/70చట్టానికి సవరణలు అవసరమన్న అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 11,12తేదీల్లో రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్ జయప్రదం చేయాలని కోరుతూ ఆదివాసీ, ప్రజాసంఘాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి.పలుచోట్ల సన్నాహక సమావేశాలు, వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలతోపాటు సంతల్లోనూ, ఇంటింటా కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

పాడేరు: 1/70, గిరిజన చట్టాలను సడలించాలని స్పీకర్ అయ్యన్న చేసిన వ్యాఖ్యలపై ఈనెల 11,12 తేదీలలో తలపెట్టిన మన్యం బంద్ విజయవంతం చేయాలని అఖిల పక్ష, ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో పాడేరు పట్టణంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఏఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కృష్ణ, మహిళా సంఘం నేతలు విమల, రవణమ్మ, తనీష్. తదితరులు వర్తక వ్యాపార వర్గాలను కలిసి బంద్ పాటించి మద్దతు ఇవ్వాలని కోరారు. మన్యం బంద్ విజయవంతానికి గిరిజన విద్యార్థులు, యువత మహిళలు, మేధావులు మద్దతు తెలపాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు కె.రాజశేఖర్, ఎం.లక్ష్మణ్ కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వి. కృష్ణ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, నాయకులు, బి. పెంటరావు కె. సురేష్, మంగ, రాజీ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: 1/70 చట్టాన్ని తూట్లు పొడిచే విధంగా కూటమి ప్రభుత్వం యత్నిస్తోందని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. స్థానిక ఆదివాసి గిరిజన సంఘం భవనంలో ఆదివారం ఆదివాసి అఖిలపక్ష ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం, సీఐటీయూ, పేసా కమిటీ, భాషా వాలంటర్ల సంఘం, ఆదివాసి సంక్షేమ పరిషత్, వైఎస్ఆర్ సీపీ నాయకులు, ఆదివాసి పరిరక్షణ సమితి , డిఎల్ఓ, కాంగ్రెస్ పార్టీ, సిపిఎం నేతలు, వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో బాక్సైట్‌ను దోచేయాలన్న కుట్రలు స్పీకర్ అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయ న్నారు. 2008లో 1/70 చట్టం పోరాటానికి మళ్ళీ నాంది పలకాలని పిలుపునిచ్చారు. పార్టీలకతీతంగా పాల్గొని బంద్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సిఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమమహేశ్వరరావు. మాట్లాడుతూ, అరకులోయ చలి ఉత్సవాలతో గిరిజనులు ఒరిగేది ఏమీ లేదని అన్నారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్,సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు,ఆదివాసి సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు వంతల నాగేశ్వరరావు,వైఎస్ఆర్ సీపీ నాయకులు కమిడి అశోక్, దండకారణ్య ఉద్యోగ సమితి నాయకులు కె ప్రసన్న కుమార్,ఆదివాసి పరిరక్షణ సమితి నాయకులు చట్టు మోహన్, ఎస్ఎఫ్ ఐ నాయకులు ఐసిబాబు,గిరిజన సంఘం నాయకులు పి రామన్న కె బుజ్జీ బాబు తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని అఖిలపక్ష ప్రజాసంఘాల నేతలు ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం ఎం శ్రీను, కొర్ర నరసయ్య, నాయకులు గాశిరం దొర, గల్లెల నారాయణ, జీనా బంధు, ఐద్వా మడల అధ్యక్షురాలు ఈశ్వరి, కార్యదర్శి విజయ పాల్గొన్నారు.

హుకుంపేట: మన్యం బంద్‌ను విజయవంతానికి ఆదివాసీ ప్రజాసంఘాల వేదిక నాయకులు ప్రచారం చేపట్టారు. .ఆదివాసి మహిళ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శి కౌసల్య హైమావతి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో వేదిక నాయకులు కృష్ణారావు,గిరిజన సంఘం నాయకులుసోమన్న లింగమూర్తి, రామారావు పాల్గొన్నారు.

పెదబయలు:మన్యం బంద్ జయప్రదం చేయాలని రోగులపేట జంక్షన్ వద్ద పిసా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు, ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా పూర్వ అధ్యక్షులు పీసా కమిటీ అధ్యక్షులు బొండా సన్నిబాబు, రోగులుపేట పిసా కమిటీ కార్యదర్శి దేవరాజు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగని ధర్మానపడాల్, సీత గుంట పంచాయితీ సర్పంచ్ బొండా గంగాధరం స్పీకర్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు బోండ గణేశ్వరరావు, కొర్ర దేవి నాయుడు, గౌడు నాని, బొండా భూదేవి, జుంబులక్ష్మి పాల్గొన్నారు.

చింతపల్లి:అఖిలపక్షాలు, ప్రజా సంఘాలు తలపెట్టిన 48 గంటల అల్లూరి జిల్లా మన్యం బందును గిరిజనులందరు జయప్రదం చేయాలని వైసిపి పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు కోరారు. ఆదివారం చింతపల్లి పరిధిలోని అంతర్ల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో స్థానిక జడ్పిటిసి పోతురాజు బాలయ్యతో కలిసి 48 గంటల నిరవధిక మన్యం బంద్ వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. మన్యం బంద్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లక్కవరపుపేట మాజీ ఎంపీటీసీ కంకిపాటి రామారావు, వైసిపి అరకు పార్లమెంట్ కార్యదర్శి పాంగి గణబాబు, నాయకులు కొర్ర నారాయణరావు, కంకిపాటి గిరిబాబు, వంతల చంటిబాబు, కవడం ఈశ్వరరావు, చల్ల నరేష్ కుమార్ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: బంద్ జయప్రదం చేయాలి ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సుంకరమెట్ట వారపు సంతలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ మాట్లాడుతూ,1/70 చట్టం సవరణ చేస్తే పర్యాటక ప్రాంతం అభివృద్ధి చెందుతుందని బాధ్యత గల రాజ్యాంగ పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాటాడటం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జి బాబు, మండల నాయకులు కె రామారావు, కె బుజ్జి బాబు, పి నానిబాబు, పి రామన్న,టి జోగులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:ఈ నెల 11,12 తేదిల్లో జరిగే ఏజెన్సీ బంద్ ను జయప్రదం చేయాలని అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు పిలుపునిచ్చారు. అనంతగిరి మండలం చిలకలగెడ్డ పంచాయితీలో ఆదివాసి అఖిల పక్ష సమావేశం టోకురు సర్పంచ్ కిల్లో మొస్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడారు.1/70 చట్టం జోలికొస్తే సహించేది లేదన్నారు.రాజ్యాంగ బద్దంగా కల్పించిన హక్కులు చట్టాలు కాలరాయలని చూస్తే ఊరుకొన్నేది లేదని హెచ్చరించారు కార్యక్రమంలో సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు పాగి అప్పారావు, వైసిపి మండల అధ్యక్షుడు కొర్ర సూర్యనారాయణ, వైసిపి ప్రధాన కార్యదర్శి శెట్టి లక్ష్మణరావు, బీంపోలు ఎంపిటిసి శిరగం అశోక్, గుమ్మకోట ఎంపిటిసి తవ్విటి నాయుడు , చిలకల గెడ్డ సర్పంచ్ మజ్జి అప్పారావు,సిపిఎం నేతలు కాకర సింగులు జి దేవన్న, సూర్యనారాయణ, బీంపోలుమాజీ సర్పంచ్ జన్ని చిన్నయ్య పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: అయ్యన్నవ్యాఖ్యలకు నిరసనగా 48గంటల మన్యం బంద్‌కు యుటిఎఫ్ జిల్లా శాఖ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని జిల్లా అధ్యక్షులు వి మహేశ్వరరావు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు పి దేముడు, ఎస్ కన్నయ్య, కె.రఘునాథ్, ఎల్‌బి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: ఎన్యం బంద్‌ను విజయవంతం చేయాలను కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రజా సంఘాల కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కుంజం జగన్నాథం అధ్యక్షతన జరిగిన ఆదివాసీ గిరిజన సంఘం సమావేశంలో మండల కార్యదర్శి కోండ్ల సూరిబాబు మాట్లాడుతూ, 48 గంటల మన్యం బంద్‌లో గిరిజన యువత, ఆదివాసీ ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు.ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు నాగరాజు, లోవరాజు, లక్ష్మణరెడ్డి, సూరిబాబు పాల్గొన్నారు.

కూనవరం : మన్యం బంద్ పోస్టర్లను ఆదివారంమండలంలోని మార్త శ్రీరాంమూర్తి భవన్‌లో ఆవిష్కరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సున్నం రాజులు మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు బాధ్యతారాహిత్య వ్యాఖ్యలకు నిరసనగా చేపట్టే బంద్ జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు,నాగమణి,వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య,సోడె శంకర్, తాళ్లూరి శ్రీనివాసరావు, తమ్మయ్య, మడెం బాబు రావు, కొండా ఈశ్వర్లు పాల్గొన్నారు.

అల్లూరి జిల్లా : మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం ఎటపాకలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కాకా అర్జున్‌దొర, ఐద్వా నాయకులు పొడియం రత్తమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హుస్సేన్, డి వై ఎఫ్ ఐ నాయకులు సుధాకర్, ప్రవీణ్, అశోక్ పాల్గొన్నారు.

సీలేరు: మన్యం బంద్ విజయవంతం చేయాలని కోరుతూ దారకొండ వారపు సంతలో గాలికొండ ఎంపిటిసి అపరంగి బుజ్జిబాబు సిపిఐ నాయకులు సుంకర విష్ణుమూర్తి ఆధ్వర్యంలో కరపత్రాలను పంచుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. ముందుగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా చేపట్టే బంద్‌లో ఆదివాసీ ప్రజలు, విద్యార్థి, ఉద్యోగ సంఘాలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు కొర్ర బాలయ్య దారకొండ పంచాయతీ పెద్దలు కోటీశ్వరరావు వివిధ పార్టీలు నాయకులు పాల్గొన్నారు.

విఆర్ పురం : మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం.రాజులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ జిఒ3 ప్రయోజనాలు పునరుద్ధరణ, ఇతర హామీల అమలుకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలులో జాప్యంపై నిరసన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలు దుర్మార్గమన్నారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు నాయకులు పంకు సత్తిబాబు ,ములకనపల్లి సర్పంచ్ సవలం మారయ్య ,పోడియం శ్రీరామ్మూర్తి, కథల కొండయ్య రెడ్డి ,తుర్రం బాబురావు ,కారం సత్తిబాబు ,వడ్లాది రమేష్, కమ్మ చిచ్చు సత్యనారాయణ, గుండెపుడి లక్ష్మణరావు ,సీరపు తాతబాబు, పులి బొజ్జి పాల్గొన్నారు...

చింతూరు: అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివాసి గిరిజన సంఘాలు ఈ నెల 11,12 తేదీలలో 48 గంటల రాష్ట్ర ఏజెన్సీ బంద్‌కు సిపిఎం సంపూర్ణ మద్దతునిస్తోందని ఆపార్టీ మండల కార్యదర్శి పల్లపు వెంకట్ అన్నారు. ఆదివారం సిపిఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశంలో బంద్‌ను జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం నాయకులు సీసం సురేష్,ఎర్రంశెట్టి శ్రీనివాస్, ముట్టం రాజయ్య, పోడియం లక్ష్మణ్, మల్లం సుబ్బమ్మ, మడకం చిన్నయ్య,సవలం కన్నయ్య, చింతా రాంబాబు, పట్రా రమేష్, కారం సుబ్బారావు పాల్గొన్నారు.

చింతపల్లిలో బంద్ పోస్టర్ల ఆవిష్కరణలో వైసిపి ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరులో పోస్టర్ల ఆవిష్కరణలో అఖిలపక్ష సంఘాల నేతలు

విఆర్.పురంలో మాట్లాడుతున్న సున్నం రాజులు

మాట్లాడుతున్న అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

సీలేరు, దారకొండ సంతలో బంద్ జయప్రదానికి కరపత్రాల ప్రచారం

చింతూరులో మాట్లాడుతున్న సిపిఎం నేత పల్లపు వెంకట్

ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

260 మందికి వైద్యసేవలు

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమహేంద్రవరానికి చెందిన రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల అధ్వర్యంలో ఆదివారం రంపచోడవరం సిరిగిందలపాడులో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ తలారి సుబ్బరావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ దాసరి ఉమమహేష్. డాక్టర్ సంపత్ కుమార్. పాల్గొని సుమారు 260మందికి వైద్య సేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు వీరిలో 74మందికి రక్తపరీక్షలు, 10మందికి థైరాయిడ్ పరీక్షలు, నలుగురికీ ఇసిజిలు, 13మందికి ఫిజియోథెరపీ చేసినట్లు స్వామీజీ తెలిపారు.

58 మందికి ఉచిత కంటి పరీక్షలు

వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వరంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించి, 58మందికి నేత్రపరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న ఎనిమిది మందికి కళ్లజోళ్లు అందించారు. ఎనిమిది మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపికచేసి, వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయానికి తరలించారు. ప్రతి ఆదివార రామకృష్ణ మిషన్ అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ రెనానేజ వైద్యశిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, నక్కా చంటి బాబు, వాలంటీర్లు దాసరి పెద్దఅప్పారావు, సూర్య, రిటైర్డ్ హెల్త్ కమ్యూనిటీ ఆఫీసర్ గుండెమెను రామారావు, అప్పలరాజు, వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. వైద్యశిబిరానికి వచ్చే రోగులు, సహాయకులకు భోజసన సదుపాయం సమకూర్చారు.

ముమ్మరంగా రోడ్ల పునర్నిర్మాణ పనులు

రోడ్డు పనులు పరిశీలిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -కొయ్యూరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే గ్రామాల్లో అభివృద్ధి పనులతో రూపురేఖలు మారిపోతున్నాయని టిడిపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, యూనిట్ ఇంచార్జి కూనిశెట్టి చంద్రరావు కోరారు. ఆదివారం బూదరాళ్ల పంచాయతీ కన్నవరం గ్రామాన్ని సందర్శించి, రోడ్డు పనులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బూదరాళ్ళ పంచాయతీ కన్నవరం నుంచి వంతమర్రి, పిట్టల పాడు, గారిమండ వరకు తారురోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. పోకలపాలెం, గొడుమలంక వరకు రోడ్డు కల్వర్టు పనులు, అలాగే బోడుదేవుల ఘాటీ నుంచి కొత్తపల్లి, సల్దిగడ, చీడిపల్లి గ్రామాల మీదుగా పోకలపాలెం రోడ్ వరకు రోడ్లు పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు జరుగుతున్నారు. గడచిన ఐదేళ్లలో అధ్వానరోడ్లతో అవస్థలు పడిన ప్రజలకు, చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నరేంద్రమోడీ కూటమి ప్రభుత్వహయాంలో గ్రామానికి రోడ్లు వేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు.

తునికాకు టెండర్లు పిలవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి అల్లూరి జిల్లా : గిరిజనులకు ఉపాధి కల్పించే తునికాకు సేకరణకు టెండర్ల ప్రక్రియ చేపట్టాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం గుండాల కాలనీలో సోందే రామారావు అధ్యక్షతన ఎటపాక మండల పార్టీ కమిటీ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొప్పెన కిరణ్ మాట్లాడుతూ గిరిజనులకు రెండో ఆదాయ వనరుగా భావించే తునికాకు సేకరణకు టెండర్లను పిలిచి ప్రక్రియ పూర్తి చేయాలని, ప్రూనింగ్ త్వరగా చేపట్టాలని కోరారు. 2012 నుంచి పెండింగ్ లో ఉన్న తునికాకు బోనస్‌ను కార్మికులకు వెంటనే చెల్లించాలని కోరారు. సకాలంలో ప్రూనింగ్ చేపట్టకపోవడం వలన గిరిజనులకు ఆదాయ వనరుల తగ్గుతుందన్నారు. ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ పై కూడా ఇది ప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మర్లపాటి నాగేశ్వరావు, జిల్లా కమిటీ సభ్యుడు ఐవి, మండల కార్యదర్శి కాకా అర్జున్, మండల కమిటీ సభ్యులు పులుసు బాలకృష్ణ, జి హరి, పొడియం రత్తమ్మ, జి హుస్సేన్ పాల్గొన్నారు.

నాగేశ్వరరావు మరణం తీరని లోటు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: గడువకుర్తి పంచాయతీ మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నేత చలుమర్తి నాగేశ్వరరావు మరణం పార్టీకి తీరనిలోటని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, విజయభాస్కర్ దంపతులు అన్నారు. గుండెపోటుతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందిన చలుమర్తి నాగేశ్వరరావు పార్థీవదేహాన్ని ఆదివారం గొబ్బిలిమడుగు గ్రామంలోని ఆయన స్వగృహంలో నిశిరీషదేవి, విజయభాస్కర్ దంపతులు సందర్శించి,నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషదేవి మాట్లాడుతూ పంచాయతీలోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం తపించే నాగేశ్వరరావు మరణం ఆయన కుటుంబసభ్యులకే కాక, పంచాయతీ ప్రజలకు, తెలుగుదేశం పార్టీకి తీరనిలోటన్నారు. నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పలువురు కూటమి నేతలు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు నియోజకవర్గ మఠం విజయభాస్కర్, టిడిపి సీనియర్ నాయకులు గణజాల తాతారావు ఉన్నారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి, విజయభాస్కర్

ముగిసిన కరాటే పోటీలు

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ పోర్టు స్టేడియం వేదికగా ఈ నెల 6 నుంచి జరుగుతున్న రెండో అంతర్జాతీయ కరాటే పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో దేశ, విదేశాలకు చెందిన 1200 మంది క్రీడాకారులు పాల్గొని తమ సత్తా చాటారు. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు సుమన్ హాజరై మాట్లాడుతూ, విశాఖలో రెండోసారి కూడా అంతర్జాతీయ కరాటే పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిలిచిందన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించినట్లు సుమన్ కొనియాడారు. గౌరవ అతిథి జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, అంతర్జాతీయ కరాటే పోటీలు నిర్వహించడం వల్ల విశాఖ పేరు ప్రతిష్టలు పెరిగాయన్నారు. హైపవర్ కప్ టోర్నీ పేరిట నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు

కుల, మతోన్మాదానికి వ్యతిరేకంగా జయగోపాల్ రచనలు

ప్రజాశక్తి-సీతమ్మధార : సమాజంలోని కుల, మతోన్మాదానికి వ్యతిరేకంగా డాక్టర్ జయగోపాల్ ఉద్యమించడమే కాకుండా అనేక రచనలు చేశారని చిత్తజల్లు వరహాలరాజు (సీవీ) తనయుడు ఉదయ భాస్కర్ తెలిపారు. ప్రముఖ నాస్తికోద్యమ నేత, పెరియార్ అవార్డు గ్రహీత డాక్టర్ జయగోపాల్ ప్రథమ వర్థంతి సభ స్థానిక పౌర గ్రంథాలయంలో భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. జయగోపాల్ చిత్రపటానికి అతిథులు, వక్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉదయభాస్కర్ మాట్లాడుతూ, రామ మందిరం-బాబ్రీ మసీద్ అంశంపై 2వేల పుస్తకాలు వేయడంలో జయగోపాల్ సహకారం మరువలేనిదని తెలిపారు. జయగోపాల్ ఆశయ సాధనకు సతీమణి శారద సహకారం అందించేవారని పేర్కొన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్, ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వీవీ.రమణమూర్తి మాట్లాడుతూ, దేశ ప్రజలను మూఢనమ్మకాల నుంచి జాగృతం చేయడంలో జయగోపాల్ పోషించిన పాత్ర అనిర్వచనీయమన్నారు. పెరియార్ ద్వారా ప్రభావితమై, మతన్మాద శక్తులపై జీవితాంతం పోరాడారన్నారు. ఆనాడు జయ గోపాల్ చెప్పినట్టే నేడు మతం పిచ్చిలోకి ప్రజలను నెట్టి పాలకులు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. జయగోపాల్ రచనలు పిల్లలకు పాఠ్యాంశాలుగా పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని జయ గోపాల్ ఆలోచన చేసేవారని, స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి, జె.రవి, కేంద్ర కమిటీ నాయకులు సాయి నరేందర్, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ నాయకులు వేదాంత మోర్య, వై.నూకరాజు, కొత్తపల్లి వెంకటరమణ, డాక్టర్ రాజేంద్రప్రసాద్, భీమ్‌సేన్ నాయకులు రవి సిద్ధార్థ, జె.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వాడపాలెం బీచ్‌లో..

ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థుల గల్లంతు

ఒకరు మృతి - మరొకరి కోసం గాలింపు

ప్రజాశక్తి - రాంబిల్లి : మండలంలోని రాంబిల్లి శివారు వాడపాలెం బీచ్‌లో ఆదివారం ఇద్దరూ ఇంజనీరింగ్ విద్యార్థులు సముద్రంలో గల్లంతయ్యారు. ఈ విషాద సంఘటనకు సంబంధించిన రాంబిల్లి పోలీసులు ఇచ్చిన వివరాలివి.

వాడపాలెం బీచ్‌కు తగరపువలస అనిట్స్ ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం బిటెక్ విద్యార్థి మొక్క సూర్య తేజ(17), అలాగే దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థి మొక్క పవన్ తేజ (17) వచ్చారు. బీచ్‌లో ఆడుతుండగా, ప్రమాదవశాత్తు సముద్రంలో గల్లంతయ్యారు సూర్యతేజ మృతదేహం లభ్యం కాగా, పవన్ కోసం గాలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సూర్య తేజ ది విశాఖ కంచరపాలెం లోని ఇంద్రానగర్ కాగా, పవన్ తేజది దువ్వాడలోని సంధ్యా నగర్.. సంఘటన స్థలాన్ని డిఎస్‌పి సత్యనారాయణ సందర్శించారు. రాంబిల్లి సీఐ నర్సింగరావు, ఎస్ఐ నాగేంద్ర ఉన్నారు.

ఇద్దరిపై కేసు

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని ఎఎస్.పేట గ్రామ శివారులో గుళ్లాట ఆడిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. ఆదివారం వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి, ఆరుగుళ్లతోపాటు, నెంబరు పట్టా, రూ.620 నగదును స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ మనోజ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ సూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

కార్మికుల ఉపాధి జోలికొస్తే పోరాటం

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రజాశక్తి -ఉక్కునగరం : కాంట్రాక్టు కార్మికుల ఉపాధి జోలికొస్తే పోరాటం తీవ్రతరం చేస్తామని ఉక్కు యాజమాన్యాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు హెచ్చరించారు. ఉక్కునగరం సిఐటియు కార్యాలయంలో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జి శ్రీనివాసరావు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 30 ఏళ్లుగా ఉక్కు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగించాలని చూడడం దుర్మార్గం అన్నారు. ఓ వైపు పర్మినెంటు కార్మికులకు విఆర్ఎస్ ఇచ్చి పంపించి, మరో వైపు కాంట్రాక్టు కార్మికులను తగ్గించేసి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర ఉందని ఆరోపించారు. ఉత్పత్తిని పెంచి నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్‌చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు కార్మికులకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. కార్మికులందరూ మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కెఎం.శ్రీనివాసరావు. నమ్మి రమణ, యు.సోమేష్, ఎన్.శశిభూషణ్, ఎన్.కృష్ణ, వివి.రమణ, చట్టి నర్సింగరావు, పి.నారాయణ, సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిజిపి హరీష్ కుమార్ గుప్తా

సమర్థవంతంగా పనిచేయండి : డిజిపి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోని పోలీసు యంత్రాంగం మరింత సమర్థవంతంగా పనిచేయాలని డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశించారు. ఆదివారం సాయంత్రం సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో సిపి శంఖబ్రత బాగ్చి విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలో చేపడుతున్న పోలీసింగ్ విధానాన్ని, లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్ విభాగాల పనితీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ విశాఖ నగరంలో పోలీసింగ్ మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, నగరంలో క్రైమ్ రేట్ పెరిగితే ఉపేక్షించేది లేదని అన్నారు. డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాల రవాణా వినియోగంపై ఉక్కు పాదం మోపాలని, నగరంలో రౌడీయిజానికి తావు లేకుండా చూడాలని సూచించారు అధికారుల నుంచి ఏమైనా గ్రీవెన్స్ ఉంటే తనకు అందజేయాలని, వాటికి త్వరలోనే పరిష్కారం చూపిస్తామని అన్నారు.

కంది పప్పు ఎప్పుడొస్తుందో?

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తెల్లరేషన్ కార్డుదారులకు ఒక్కొక్క కార్డుకు కిలో చొప్పున రూ.67కి అందించే కందిపప్పును ఫిబ్రవరి మాసంలో నేటి వరకూ ఏ ఒక్కరికీ ఇవ్వలేదు. సంబంధిత అధికారులు దీని గురించి స్పందించి ప్రకటన చేయలేదు. అయితే ఈ నెలలో రేషన్ కార్డులపై కందిపప్పు ఇవ్వడం లేదని ,తెలిసింది. రేషన్ డిపోల డీలర్లు, ఇంటింటికీ డోర్ డెలివరీ పేరుతో రేషన్ సరుకులను అందజేస్తున్న వాహనాల నిర్వాహకులు పలువురు ఇదే విషయాన్ని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో దాదాపు కందిపప్పు అనే మాటను రేషన్ కార్డు ఉన్న వారంతా మరిచిపోయారు. అయితే, ఎన్నికల సమయంలో మాత్రం కూటమి నాయకులు రేషన్ సరుకులను ఒకటి, రెండు కాకుండా కందిపప్పుతో సహా మిగిలిన సరుకులనూ అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం ఉన్నప్పుడు ఇస్తున్న బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు ఇచ్చే ప్రయత్నం చేశారు. నగరంలో అక్టోబర్ మాసంలో కిలో రూ.67కి కందిపప్పు అందించారు. మరోసారి జనవరి మాసంలో ఇచ్చారు. ఈ నెల పూర్తిగా ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 మాసాలు పూర్తి కాగా కేవలం రెండు నెలలు మాత్రమే కందిపప్పు అందించారు. మార్చి నెలలో కందిపప్పు ఇస్తారా ? లేదా ? అనేది స్పష్టత రాలేదు. దీంతో కందిపప్పు పంపిణీ మూన్నాళ్ల ముచ్చట అని ప్రజలు అప్పుడే విమర్శలు చేస్తున్నారు. ప్రస్తుతం అర్బన్ డిఎస్‌ఒ పరిధిలో విశాఖ నగరంతో పాటు ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి తదితర ప్రాంతాలు ఉన్నాయి. 5,12,619 తెలుపు కార్డులతో పాటు 625 చౌక ధరల డిపోలు ఉన్నాయి. ఒక జిల్లా సప్లయి అధికారి (డిఎస్ఒ) ఆధ్వర్యంలో ముగ్గురు అసిస్టెంట్ సప్లయి ఆఫీసర్లు (ఎఎస్ఒలు)తో కలిపి 21 మంది చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు, నాలుగు మండలాల డిప్యూటీ తహశీల్దార్లు (సిఎస్‌డిటి) ఈ విభాగంలో పనిచేస్తున్నారు. జిల్లాలో డోర్ టూ డోర్ పంపిణీ కోసం 310 డిఎంఇ వాహనాలను ఉపయోగిస్తున్నారు. రెండు, మూడు రేషన్ డిపోలకు కలిపి వాహనాల ద్వారా సరకులు అందిస్తున్నారు.

పెరిగిన ధరలతో విలవిల

ప్రస్తుతం మార్కెట్‌లో కందిపప్పు రూ.160 నుంచి రూ.180 పలుకుతోంది. ఇంత ఖరీదుతో కందిపప్పు కొనుగోలు చేసి తినే పరిస్థితి పేదలకు లేదు. దీంతో రేషన్ షాపుల ద్వారా ఇచ్చే కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో కందిపప్పుకు మంచి గిరాకీ ఉంది. జిల్లాలోని 5,12,619 తెలుపు కార్డుదారుల కోసం నెలకు 512 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం ఉంటుంది. అక్టోబర్‌లో 30 టన్నుల కందిపప్పు విడుదల కాగా రేషన్ డిపోకు వంద కిలోల చొప్పున కొన్ని డిపోలకు కేటాయించారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో జనవరిలో కందిపప్పు అందించారు. ఫిబ్రవరిలో మళ్లీ పంపిణీ నిలిపివేయడంతో లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు.

తాగునీటి పథకాలపై శ్రద్ధేదీ..?

ఇలాగైతే వేసవిలో కష్టాలే
కొన్నిచోట్లకే పరిమితమైన ఇంటింటికీ కుళాయిలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో తాగునీటి పథకాలు, వాటి నిర్వహణ పనులను త్వరితగతిన పూర్తిచేయకపోతే రానున్న వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడనుంది. కుళాయి కనెక్షన్ల ద్వారా ఇంటింటికీ రక్షిత నీరు సరఫరా చేసేందుకు ఉద్దేశించిన జల జీవన్ మిషన్ పథకం నిధులను, జిల్లా పరిషత్ సాధారణ నిధులను, 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామీణ నీటి సరఫరా విభాగం సకాలంలో వినియోగించకపోవడంతో సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. వెరసి వేసవిలో గ్రామీణ ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంకానుంది.

కోటవురట్ల మండలంలోని తాగునీటి పథకం

జిల్లాలోని 572 పంచాయతీల్లో 15.33 లక్షల జనాభా వుంది. తాగునీటి కోసం చేతిబోర్లు 16 వేలు, పిడబ్ల్యు పథకాలు 1850, సిపిడబ్ల్యు పథకాలు 28 వున్నాయి. జలజీవన్ మిషన్ కింద రూ.552 కోట్లతో 1615 పనులు పూర్తిచేయాల్సివుండగా ఇప్పటివరకు రూ.237 కోట్లు ఖర్చు చేసి 928 పనులు పూర్తిచేశారు. మిగిలిన 687 పనులు వివిధ దశల్లో వున్నాయి. హౌసింగ్ కాలనీల్లో 191 పనులు పూర్తిచేసి ఇంటింటికీ కుళాయి కనెక్షన్లతో తాగునీటి సరఫరా చేసేందుకు మంజూరు చేసిన రూ.120 కోట్లలో 58 పనులకు రూ.23 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా 133 పనులు పూర్తిచేయాల్సివుంది. అత్యధిక హౌసింగ్ కాలనీల్లో తాగునీటి వనరులు అందుబాటులో లేవు. నీటి కోసం మహిళలు నడిచివెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా జలజీవన్ మిషన్ నిధులతో కుళాయి పనులు పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలోని 4.17 లక్షల కుటుంబాల్లో ఇప్పటివరకు 2.64 లక్షల కుటుంబాలకు మాత్రమే ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. మంచి నీటి పథకాల నిర్వహణ పనుల నిమిత్తం కేటాయించిన జిల్లా పరిషత్ సాధారణ నిధులను సక్రమంగా వినియోగించడంలేదు. ఎంపీ లాడ్స్, 15వ ఆర్థిక సంఘం నిధులు సరిగా ఉపయోగించకపోవడంతో పథకాల మరమ్మతులు జరగక తాగునీటి ఇబ్బందులను ప్రజలు ఎదుర్కోవాల్సివస్తోంది. 2023-24లో 12 పథకాల నిర్వహణకు మంజూరు చేసిన రూ.20.35 లక్షలలో తొమ్మిది పనులు పూర్తిచేశారు. రెండు పనులు జరుతుండగా, ఇంతవరకు ఒక పనిని ప్రారంభించలేదు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 32 పనుల కోసం రూ.59.88 లక్షలు మంజూరు చేయగా, ఎనిమిది పనులు పూర్తికాగా 14 పనులింకా కొనసాగుతున్నాయి. పది పనులు మొదలుపెట్టలేదు. ఎంపీ ల్యాడ్స్ కింద కోటీ 68 లక్షలతో 55 పనులు చేపట్టాల్సివుండగా వీటిలో 47 పూర్తిచేశారు. ఎనిమిది పనులు ప్రారంభించలేదు. 2023-24లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5.86 కోట్లతో చేపట్టాల్సిన 231 పనుల్లో రూ.71.69 లక్షలు ఖర్చు చేసి 143 పనులు పూర్తిచేయగా, మరో 16 పనులు వివిధ స్థాయిల్లో వున్నాయి. 2023-24లో 72, 2024-25లో 88 పనులను ప్రారంభించలేదు. 2024-25లో ఆర్థిక సంఘం నిధులు ఐదు కోట్లతో 245 పనులు పూర్తిచేయాల్సివుంది. కానీ వీటిని కూడా సకాలంలో పూర్తిచేయలేదు. వేసవి సమీపిస్తుండడంతో తాగునీటి వనరుల పనితీరుపై సమీక్షించి మరమ్మతులు చేపట్టకపోతే ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తనున్నాయి.

నామినేషన్లకు నేడే ఆఖరి రోజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 27న జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు సమర్పించడానికి సోమవారం ఆఖరి రోజు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయడానికి అవకాశం ఉంది. మొదట రోజున ఏ ఒక్కరూ నామినేషన్ వేయలేదు. 4వ తేదీన ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు సమర్పించగా, 6వ తేదీన ఒకరు, 7వ తేదీన నలుగురు నామినేషన్లు వేశారు. నామినేషన్లు సమర్పించడానికి ఆఖరి రోజైన సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామపత్రాలను స్వీకరిస్తారు. ఇంతవరకూ నామినేషన్లు సమర్పించిన వారిలో యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, ఎపిటిఎఫ్ బలపరిచిన, సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, గతంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా పనిచేసిన, పిఆర్‌టియు మద్దతుతో పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులు నాయుడు ఉండగా, స్వతంత్రులుగా కోసూరు రామకృష్ణ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, రాయల సత్యనారాయణ, పోతల దుర్గారావు, నూకల సూర్యప్రకాష్ ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ రెండు సెట్లు నామినేషన్లు సమర్పించారు.

నేడు ఓటర్ల తుది జాబితా ప్రకటన

ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ఈసరికే సిద్ధమైంది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఉత్తరాంధ్ర జిల్లాల్లో మొత్తం 21,555 మంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం ఓటర్లుగా నమోదు కావడానికి నామినేషన్లు స్వీకరణ గడువు ముగిసిన రోజు వరకు ఉంది. దీంతో 1300 మంది ఓటు కోసం దరఖాస్తులు సమర్పించారు. ఈ దరఖాస్తులను ఉత్తరాంధ్రలోని ఆయా జిల్లాలకు పరిశీలన కోసం పంపారు. అర్హులైన ఓటర్ల వివరాలను నివేదిక రూపంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పరిశీలించి, తుది రూపం ఇచ్చి, సోమవారం ప్రకటించనున్నారు. దీంతో మొత్తం ఓటర్లు అసలు సంఖ్య ఎంతనేది స్పష్టం కానుంది.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

'సాధుమంజీరాలు' ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖపట్నం : అమరావతి విశ్వసాహితి ఆధ్వర్యంలో పిఎల్‌వి.ప్రసాద్ రచించిన 'సాధుమంజీరాలు' త్రిశతి పద్యకృతి ఆవిష్కరణ కార్యక్రమం విశాఖ నగరంలో ఆదివారం ఘనంగా సాగింది. రొంగలి రాములు స్వాగతోపన్యాసం చేయగా వందేమాతరం శ్రీనివాసరావు ప్రార్థనతో సభ ప్రారంభమైంది. సభాధ్యక్షులు పొలమరశెట్టి ఫ్రాన్సిస్ మాట్లాడుతూ పద్యం గొప్పతనాన్ని వివరించారు. ముఖ్య అతిథి, ఆవిష్కర్త, విజయనగరం మున్సిపల్ కమిషనర్ పల్లి నల్లనయ్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. మొదటి ప్రతిని వేగి సత్యనారాయణ అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డివి.సూర్యారావు మాట్లాడుతూ అమరావతి విశ్వసాహితి సేవలను కొనియాడారు. శతక చరిత్రను విశ్లేషించారు. పియల్‌వి.ప్రసాద్ సాహితీ కృషిని అభినందించారు. సమాజానికి శతకాల అవసరం ఉందన్నారు. సిహెచ్.చిన సూర్యనారాయణ పుస్తక సమీక్ష చేస్తూ.. కొన్ని పద్యాలను చదివి, విశ్లేషించి, పాడి వినిపించారు. ముఖ్య అతిథి పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రసాద్ కృషిని మెచ్చుకున్నారు. తెలుగు భాషలో పద్యం గొప్పతనాన్ని వివరించారు. కవి ప్రసాద్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బీచ్ రోడ్డులో ఆక్రమణలపై కొనసాగిన సర్వే

ప్రజాశక్తి - భీమునిపట్నం : సిఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా స్థానిక బీచ్ రోడ్డులో ఆక్రమణలు జరిగాయని, సంబంధిత వివరాలను న్యాయస్థానానికి తెలియజేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో కలెక్టర్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు జివిఎంసి, కాలుష్య నియంత్రణ మండలి, సిఆర్‌జెడ్ అధికారులు రెండో రోజైన ఆదివారమూ పలు ప్రాంతాల్లో సర్వే జరిపారు. పరిశీలన పూర్తయ్యాక సంబంధిత నివేదికను బుధవారం నాటికి హైకోర్టుకు వారు సమర్పించాల్సి ఉంది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు గతంలో వైసిపి మాజీ ఎంపీ విజయ సాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి అక్రమించినట్టుగా చెప్పబడుతున్న స్థలంలో ఇప్పటికే ప్రహరీని జివిఎంసి అధికారులు పాక్షికంగా కూల్చివేశారు. అదే ప్రాంతంతో పాటు తీరం వెంబడి వెలసిన ఎస్ఒఎస్ కూడలి వద్ద శ్మశాన వాటికకు ఆనుకుని నిర్మించిన ఓ రెస్టారెంట్, కొబ్బరి తోట పార్కు, పక్కనే ఉన్న తీరం రిసార్ట్, పలు రెస్టోబార్ ప్రాంతాల్లో బృందం సర్వే చేపట్టింది. సిఅర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి జరిపిన ఆక్రమణలపై తుది నివేదికను ఈ నెల 12లోగా కలెక్టర్‌కు ఇవ్వనున్నట్టు అధికారులు చెబుతున్నారు. జివిఎంసి అదనపు కమిషనర్ ఎస్ఎస్.వర్మ, పట్టణ ప్రణాళిక విభాగం ఉప ప్రణాళిక అధికారి కె.హరిదాసు, మండల తహశీల్దార్ పైలా రామారావు, జివిఎంసి ఒకటో జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామకృష్ణ తదితరులు తాజా సర్వేలో పాల్గొన్నారు

'బురద జల్లడం సరికాదు'

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ : ఈ నెల 8న సాక్షి దినపత్రికలో తన పేరుతో వచ్చిన కథనం తన ప్రమేయంతో రాసింది కాదని, దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిపిఎం 1/70కి ఎప్పుడూ అనుకూలమేనని, ఈ యాక్ట్ రక్షణకు పని చేస్తున్నామని తెలిపారు. మైదాన గిరిజన ప్రాంతాన్ని ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని సిపిఎం చేపట్టిన పాదయాత్రలోనూ, లేటరైట్ తవ్వకాలకు జర్తా లక్ష్మణ్‌రావు, ఇతరుల పేరిట ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని, తవ్వకాలు నిలిపివేయాలని జరిగిన నాటి పబ్లిక్ హియరింగ్‌లోనూ తాను ప్రత్యక్షంగా పాల్గొన్నానని అన్నారు. నేటికీ పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గిరిజన, గిరిజనేతరుల మధ్య తగాదాలు సృష్టించడం తగదన్నారు. సాక్షిలో వచ్చిన కథనాన్ని ఉపయోగించుకొని సిపిఎంపై బురద జల్లడం సరికాదని హెచ్చరించారు. గిరిజనులు, గిరిజన పెద్దలు అర్థం చేసుకుని మెలగాలని కోరారు.